ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



## సిజెఐగా జస్టిస్ ఖన్నా
# 11న ప్రమాణం
### ఆరు నెలలపాటు పదవిలో కొనసాగున్న ఖన్నా

న్యూఢిల్లీ, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): భారత సుప్రీం తదుపరి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఆయన ఈ నెల 11న బాధ్యతలు చేపడతారు. కేవలంఆరు నెలలు మాతరమే పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ ..మిగతా 2లో

సంపుటి: 2 | సంచిక: 198 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 26 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

# కరెంటే ఛార్జీలే
# తెలంగాణ ఉద్యమ పునాది



### కాంగ్రెస్ పది నెలల పాలనలో మళ్లీ పాతరోజులు
### ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించండి
### ఇఆర్‌సి బహిరంగ విచారణలో కెటిఆర్ వినతి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): కరెంట్ ఛార్జీల పెంపు కారణంగానే తెలంగాణ ఉద్యమం పుట్టిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆనాడు ఛార్జీలు పెంచితేనే కేసీఆర్ ఉద్యమం మొదలుపెట్టారని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే అదే పరిస్థితి తేవటం శోచనీయమని అన్నారు. ఈఆర్సీ ఛైర్మన్ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని.. ఈ ప్రాంత బిడ్డగా తెలంగాణ ప్రయోజనాలకు నష్టం చేకూర్చే ప్రతిపాదనలను తిరస్కరించాలని మిమ్మల్ని కోరుతున్నా అని అన్నారు. విద్యుత్ వ్యాపార వస్తువుగా చూడవద్దని.. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తిగా భావించాలని కోరారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు సంబంధించి ఈఆర్సీ సిరిసిల్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నా నియోజకవర్గంలోని సెస్ అనేది చాలా ప్రతిష్టాత్మక సంస్థ అని కేటీఆర్ తెలిపారు. దేశంలో సహకార రంగంలో ఉన్న చాలా తక్కువ విద్యుత్ సంస్థల్లో సెస్ ఒక్కటి అని చెప్పారు. మా నేతృత్వంలోని ఇక్కడి సెస్ పాలక వర్గం బ్రహ్మాండంగా పనిచేస్తోందని అన్నారు. డిస్కంలతో పోల్చితే మా సెస్ పనితీరు 100 శాతం మెరుగు అని గర్వంగా చెబుతున్నా అని అన్నారు. గతంలో సెస్ ను రాష్ట్ర ప్రభుత్వంలోని సంస్థల్లో కలపాలని ప్రయత్నిస్తే ఇక్కడి ప్రాంత వాసులు వ్యతిరేకించారని గుర్తుచేశారు. వ్యవసాయ విద్యుత్‌ను 5 నుంచి 7.5 హెచ్‌పీకి పెంచాలని.. 7.5 హెచ్‌పీకి సబ్సిడీ ఇవ్వాలని కోరారు. గతంలో ఎన్‌పీసీడీఎల్ సగటు ధర నిర్ణయించేదని.. కానీ ఆ తర్వాత బల్క్ సప్లయ్ టారిఫ్ ఆధారంగా నిర్ణయిస్తోందని.. ..మిగతా 2లో

# గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నాం
### అందుకే ఫినిష్ చేయాలని చూస్తున్నారు: రేవంత్ రెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): హైదరాబాద్‌లో ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌ను రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్రను వివరించారు. కాంగ్రెస్ హయాంలో దక్షిణాదితో పాటు ఉత్తరాదికి మేలు జరిగింది.. ఎన్డీయేలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దేశాభివృద్ధి కోసం భాక్రానంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకు ఎన్నో ప్రాజెక్టులు కట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేసి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. కానీ.. ఇప్పుడు వివక్షతో పరిపాలన చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 'ఇందిరా గాంధీ హయాంలో గరీబీ హఠావోతో ఎన్నో మార్పులు చేశారు. ప్రతి ఒక్కరికీ ఆహారం అందాలని చర్యలు చేపట్టారు. రాజీవ్ గాంధీ హయాంలో ఓటింగ్ వయసును 21 నుంచి 18 ఏళ్లకు మార్చారు. కంప్యూటర్లతో ఐటీ విప్లవం తీసుకొచ్చారు. టెలికాం రంగంలో మార్పులు తీసుకువచ్చారు. మహాత్మగాంధీ ఆలోచనల ప్రకారం స్థానిక సంస్థల్లో అధికారాలను కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 'పీవీ నరసిహారావు దక్షిణాది నుంచి ప్రధానిగా సేవలు అందించిన గొప్పవ్యక్తి. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్‌తో కష్టాల్లో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించారు. నెహ్రూ నుంచి ఇందిరాగాంధీ వరకు కాంగ్రెస్ నేతలందరూ ప్రజలందరి మౌలిక అవసరాలు తీర్చాలని ప్రయత్నం చేశారు. తరువాత 30 ఏళ్లు టెక్నాలజీ, టెలికాం ఇతర రంగాల్లో కాంగ్రెస్, యూపీఏ సేవలు అందించింది. కాంగ్రెస్, యూపీఏ హయాంలో ఎన్నో విప్లమాత్మక మార్పులు వచ్చాయి' అని సీఎం వివరించారు. 'మూడోసారి ప్రధాని అయిన నరేంద్రమోదీ ఈ దేశ ప్రజల కోసం ఏ రెవల్యూషన్ తీసుకువచ్చారు? మోదీ హయాంలో దేశానికి ఏం సేవలు చేశారు? ఎవరికి ప్రయోజనం చేకూర్చారో చెప్పండి. పార్టీలను, ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో పోలీస్ కుటుంబాల ఆందోళన

### సచివాలయం ముందు ధర్నాకు యత్నం
### ఏక్ పోలీస్-ఏక్ స్టేట్ విధానాన్ని అమలు చేయాలి
### అడ్డుకుని పంపించేసిన పోలీసులు



హైదరాబాద్, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): పోలీస్ కానిస్టేబుల్ భార్యల ముట్టడితో సచివాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. 'ఏక్ పోలీస్ ఏక్ స్టేట్' విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసు కానిస్టేబుల్ భార్యలు శుక్రవారం నాడు సచివాలయం ముట్టడికి యత్నించారు. 'ఏక్ పోలీస్-ఏక్ స్టేట్' విధానాన్ని అమలు చేసి తమ భర్తలకు ఒక దగ్గర డ్యూటీ చేసే అవకాశం కల్పించాలని కానిస్టేబుళ్ల భార్యలు డిమాండ్ చేశారు. అది ..మిగతా 2లో



## నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్స్‌లర్
# ఒలాఫ్ స్కోల్జ్ సమావేశం
### పలు అంశాలపై సుదీర్ఘ చర్చ

న్యూఢిల్లీ, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): భారత ప్రధాని నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించేందుకు గాను శుక్రవారం వీరిద్దరూ సమావేశమయ్యారు. ఇందులో భాగం గానే ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా రక్షణ, వాణిజ్యం, స్వచ్ఛ ఇంధన రంగాలపై ఇరువురు నేతలు విస్తృత స్థాయిలో చర్చలు జరపున్నట్లు తెలుస్తోంది. 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో పాల్గొనేందుకు జర్మనీ ఛాన్స్‌లర్ గురువారం భారత్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చారు. గురువారం అర్ధరాత్రి వచ్చిన ఛాన్సలర్‌ను రాష్ట్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిత్యానంద రాయ్ కలుసుకున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు స్కోల్జ్ అక్టోబర్ 24 నుంచి 26 వరకు భారత్‌లో అధికారికంగా ..మిగతా 2లో

## సుందరీకరణకు ఓకే...
# ఇళ్ల కూల్చివేతలకు నో




### పేదల ఇళ్ల జోలికి వస్తే ఖబర్దార్
### మూసీ సుందరీకరణ పేరుతో స్కామ్
### సుందరీకరణతో డబ్బులు దండుకునే యత్నం
### బిఆర్ఎస్ బాటలోనే రేవంత్ సర్కార్
### రాబర్ట్ వాద్రాకు ప్రాజెక్ట్ కట్టబెట్టే యత్నం
### మూసీ బాధితులకు మద్దతుగా ధర్నాలో బిజెపి నేతల విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం): మూసీ సుందరీ కరణకుతాము వ్యతిరేకం కాదని,మూసీ పరివాహకంలో పేదలను తరిమివేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామని బిజెపి స్పష్టం చేసింది. పేదలకు అన్యాయం జరగకుండా మూసీ సుందరీకరణ చేపడితే తాము కరసేవ కూడా చేస్తామని స్పష్టం చేసింది. మూసీ పేదలకు మద్దతుగా ఇందిరాపార్క్ వద్ద బిజెపి చేపట్టిన ధర్నాలో కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. మూసీ ప్రాజెక్ట్‌కు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వారు మూడు నెలల పాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటే ప్రాజెక్టును విరమించు కుంటానంటూ ముఖ్యమంత్రి రేవంత్ చేసిన సవాల్‌ను స్వీకరించేం దుకు సిద్ధంగా ఉన్నట్లు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజల కోసం వారి ఇళ్లలో ..మిగతా 2లో




# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
### తనిఖీలు నిర్వహించి
### బాంబు లేదని తెలిసినా అధికారులు
### ఈ నెలలో ఐదవ సారి ఫేక్ బాంబు బెదిరింపు

శంషాబాద్, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) హైదరా బాద్ నుండి జారండ్ వెళ్లాల్సిన ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు బెదిరించి అగాంతకులు కలకలం సృష్టిం చారు. శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఝూరండ్ వెళ్లాల్సిన విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. అందులో ఉన్న ప్రయాణి కులను కిందికి దింపి సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీనితో అప్రమత్తమైన అధికారులు సిఐఎస్ఎఫ్ సిబ్బంది వెంటనే ఆవిమానాన్ని నిలిపివేసి తనిఖీలు నిర్వహించారు. పేలుడు పదార్థాలను పసిగట్టే వస్తువులతోపాటు మెటల్ డిటెక్టర్. శునకాలను రంగంలోకి దింపి విమానంలో అణువ ణువునా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అందులో ఎలాంటి పేలుడు పదార్థం లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలోని విమా నాలకు ఈ నెలలో వచ్చిన ఐదవ ఫేక్ బాంబు బెదిరింపుగా అధికారులు పేర్కొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# కరెంటే ఛార్జీలే తెలంగాణ ఉద్యమ పునాది

మొదటి పేజీ తరువాయి...

సర్ ఛార్జీ కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. సెస్ ను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిపుష్టమైన సబ్సిడీ ఇస్తూ ఎప్పటికప్పుడు ఆ డబ్బు ప్రభుత్వం నుంచి సంస్థకు వచ్చే విధంగా గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంత శాసనసభ్యునిగా నేతన్నల సమస్యలు తెలిసిన వ్యక్తిగా మిమ్మల్ని విజ్ఞప్తి చేస్తున్నా అని అన్నారు. తెలంగాణ ఏర్పడిన నాడు మనం తీవ్రమైన విద్యుత్ కొరతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. పారిశ్రామికవేత్తలు పవర్ హాలిడేస్ వద్దని ఇందిరా పార్క్ వద్ద ధర్నాలకు దిగిన పరిస్థితి ఉండేదని.. మరోవైపు రైతులు కరెంట్ లేక తీవ్ర నిరాశలో ఉన్న పరిస్థితి ఉందని గుర్తు చేశారు. సిరిసిల్లలో కూడా పవర్ లూమ్ పరిశ్రమ కరెంట్‌తోనే ముడిపడి ఉందన్నారు. ఇక్కడ కూడా కరెంట్ లేక ఎంతో మంది నేతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించి ప్రతి మనిషికి విద్యుత్‌తో విడదీయరాని సంబంధం ఉందని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు పదేళ్ల పాటు విద్యుత్ సంస్థలకు స్వర్ణయుగంగా మారిందని కేటీఆర్ అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన 10 నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. దానికి తోడు ఇప్పుడు కరెంట్ ఛార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాలకులకు విజన్ ఉంటే.. సంపద పెంచి పేదలకు పంచాలి.. కానీ.. ప్రజలపై కరెంట్ చార్జీల భారం మోపి.. సంపద పెంచుకోవాలనే ఆలోచన చేయటం దుర్మార్గమని అన్నారు. డిస్కమ్ లంటే డిస్ట్రిబ్యూషన్ సంస్థలే తప్ప ఖజానాకు కంట్రిబ్యూషన్ చేసే కంపెనీలు కాదని సూచించారు. విద్యుత్ అంటే వ్యాపారం కాదు.. రాష్ట్ర ప్రగతిని పరుగులు పెట్టించే రథచక్రమని అన్నారు. విద్యుత్ సంస్థల బలోపేతం కోసం చేసే ఖర్చు భారం కాదని.. అది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. అదనపు ఆదాయం కోసం.. 18 వేల కోట్ల అదనపు భారం మోపాలన్న కాంగ్రెస్ సర్కారు ఆలోచనే ప్రజా వ్యతిరేకమైనదని విమర్శించారు. విద్యుత్ సంస్థలు ప్రతిపాదించిన చార్జీలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని కోరారు. వివిధ కారణాలు చెప్పి 963 కోట్లు అప్ ఛార్జీలను ప్రజలపై భారం వేయాలనుకోవటం సరికాదని హితవు పలికారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూడా తక్షణం రూ. 12 వందల కోట్లు పెంచుకోవటంతో పాటు డిస్కంలు చేసిన 9 ప్రతిపాదనలు తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజల మీద ఒక్క రూపాయి భారం వేయలేదని కేటీఆర్ గుర్తుచేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్ట్ ఉచితంగా నీళ్లు ఇచ్చినప్పటికీ ఒక్క రూపాయి భారం వేయలేదని అన్నారు. ఇప్పుడు డిస్కంలు చేసిన ప్రతిపాదన పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచేలా ఉందని విమర్శించారు. ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. 11కేవీ, 33కేవీ, 220 కేవీ కింద నడిచే పరిశ్రమలకు సంబంధించి అన్నింటిన ఒకే కేటగిరీ లోకి తీసుకురావడం అసంబద్ధమని తెలిపారు. అదానీ ఒక ఫ్యాక్టరీ పెడితే వారికి వర్తించే కేటగిరీనే మా సిరిసిల్లలో సాంచాలు నడిపే పరిశ్రమకు ఉంచాలనుకోవటం హేతుబద్ధమైన నిర్ణయం కాదని అన్నారు. పరిశ్రమలకు సంబంధించి కరెంట్ ను అన్నింటిని ఒకే గాటున కట్టడమంటే సూక్ష్మ చిన్న, మధ్య పరిశ్రమలకు ఉరి వేస్తున్నట్లే అని అన్నారు. ఈ విధమైన కుట్ర చేస్తూ చిన్న పరిశ్రమలకు రాయితీ ఇవ్వకుండా ఉండే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కుంటు పడిందని.. చాలా పరిశ్రమలు తరలిపోతున్నాయని తెలిపారు. ఇంకా ఛార్జీలు పెంచితే పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కుటీర పరిశ్రమలు, చిన్న పరిశ్రమలు బేంబేలెత్తేపోతాయని తెలిపారు. కుటీర, చిన్న, పెద్ద పరిశ్రమలను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిస్కంలు చేసిన ప్రతిపాదనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని అన్నారు.రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 12 వందల కోట్లు భరించిందని.. ఈ ప్రభుత్వం ఎందుకు భరించదని కేటీఆర్ ప్రశ్నించారు. మోటార్లకు మీటర్లు పెట్టాలని కేంద్రం ఒత్తిడి తెచ్చినా తాము అంగీకరించలేదని తెలిపారు. 10 హెచ్ పీ వరకు సిరిసిల్ల నేతన్నలకు సబ్సిడీ ఇచ్చామన్నారు. నాయి బ్రహ్మణులు, రజకులకు, ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత విద్యుత్ ఇచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. పదినెలలకే ఎందుకు ఛార్జీలు పెంచే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు.

## గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నాం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వాలను విడగొట్టారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసేందుకు పనిచేశారు. ప్రజలకు మాత్రం ప్రధాని మోదీ పార్టీ ఏం చేయలేదు. పార్టీలను చీల్చడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప మీరు చేసిందేంటీ? ఈ దేశంలో ఉత్తర, దక్షిణ భారతదేశం అనే విభజన తేవడానికి ప్రయత్నిస్తున్నారు' అని రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం చిన్నచూపు చూస్తోంది. సౌత్ స్టేట్స్‌కు ప్రధాని అందించిన సహకారం తక్కువ. నిధులు ఇవ్వకపోయినా.. ఇక్కడి ఓట్లు కావాలని ఎలా అడుగుతారు. నార్త్ స్టేట్స్‌తో పోలిస్తే.. సౌత్ స్టేట్స్ ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నా.. వాటిలో తిరిగి పొందేది చాలా తక్కువ. కేంద్రానికి మేం ఒక్క రూపాయి పంపిస్తే.. కేవలం రూ.40 పైసలు తిరిగి వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను దక్షిణాది రాష్ట్రాలు ఆహ్వానిస్తున్నా.. నిధుల విషయంలో వివక్ష జరుగుతూనే ఉంది' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 'అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా బాపూ ఘాట్‌ను అభివృద్ధి చేస్తాం. ప్రపంచమంతా హైదరాబాద్ వైపు చూసేలా అభివృద్ధి చేయబోతున్నాం. ఈసా, మూసా నదులు కలిసే చోట బాపూ ఘాట్ ఉంది. గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంలా.. బాపూ ఘాట్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీజేపీ వ్యతిరేకిస్తోంది' అని రేవంత్ ఆరోపించారు. 'గాంధీ వారసులుగా మేం బాపూ ఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసి తీరుతాం. దీన్ని బీఆర్ఎస్, బీజేపీ ఎందుకు అడ్డుకోవాలని చూస్తున్నాయి? మీరు గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించుకోవచ్చు.. కానీ మేము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారెందుకు.? ఎందుకంటే మేము గుజరాత్‌కు పోటీ ఇవ్వబోతున్నామని.. అందువల్లే తెలంగాణను, హైదరాబాద్‌ను ఫినిష్ చేయాలని.. బీజేపీ నేతలు మా ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటున్నారు' అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 'పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపించిన గత కేసీఆర్ పది సార్లు కూడా సెక్రటేరియట్‌కు రాలేదు. ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారు. కేసీఆర్‌కు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ఎందుకు బయటకు రావడం లేదు. కేసీఆర్ ఆయనే ఫ్రీడం ఫైటర్ అని చెప్పుకుంటాడు. నాకేమీ అభ్యంతరం లేదు. గత పది నెలల్లో ఒక్కసారి కూడా అసెంబ్లీకి రాలేదు. తానో జమిందార్, ప్రజలందరూ గులాంలని కేసీఆర్ అనుకుంటాడు. అందుకే బయటరు రావడం లేదు' అని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు.

## సుందరీకరణకు ఓకే... ఇళ్ల కూల్చివేతలకు నో

మొదటి పేజీ తరువాయి...

నివాసం ఉండేందుకు మేము సిద్ధం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 నెలలు పూర్తి కావస్తోందని.. నిరుపేదలకు ఇచ్చేందుకు ఏ ఇంటికి రేవంత్ సర్కార్ శంకుస్థాపన చేయలేదని, భూమి పూజ చేయలేదని విమర్శించారు. కొత్తగా ఇవ్వకపోగా ఏండ్లుగా నివసిస్తున్న నిరుపేదల ఇండ్లను కూలుస్తోందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని.. ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను గారడీలుగా మార్చి మసిపూసి మారేడుకాయ చేశారన్నారు. ప్రజలను సోనియా, రాహుల్, రేవంత్ మభ్యపెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వాళ్ళు కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేశారని.. ప్రజల ఇండ్లకు మార్కింగ్ వేసి ప్రజలను భయపెట్టారని తెలిపారు. కేసీఆర్ దారిలోనే రేవంత్ వెళ్తున్నారని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. కానీ పేదల ఇండ్లను కూలిస్తే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ సుందరీకరణ చేసుకోవాలన్నారు. మూసీ బాధితులు ఎవరైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్‌కు మూసీ పక్కన ఉండలేక పోతున్నామని చెప్పారా.. మా ఇండ్లు కూల్చమన్నారా. రేవంత్‌కు కలపడినట్టు ఉంది. అయితే ఆ కల లక్షన్నర కోట్లపైన అయి ఉండొచ్చు.. కానీ పేద ప్రజలకు మంచి చేయాలనేది మాత్రం కాదు అంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ బాధితులకు అండగా బీజేపీ ఉంటుందని స్పష్టం చేశారు. వారికోసం అవసరమైతే చంచల్ గూడ జైలుకు అయినా, చర్లపల్లి జైలుకు అయినా వెళ్లేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రేవంత్ పోలీసులతో వస్తాడా? ఎలా వస్తాడో కానీ బస్తీల్లోకి రావాలి. ఆయన్ను ప్రజలు ఏమనకుండా మేము రక్షణగా ఉంటాం.. సెక్యూరిటీ విషయంలో ఆయనకు చింత అక్కర్లేదు. డ్రైనేజీ సిస్టం లేకుండా మూసీ సుందరీకరణ ఎలా సాధ్యం. రేవంత్‌కు పేదలకు కనీస సౌకర్యాలు అందించడం ముఖ్యమా.. మూసీ సుందరీకరణ అవసరమో తేల్చుకోవాలి. వాస్తవానికి మాకు రెండూ ముఖ్యమే.. కానీ ముందు పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించి తర్వాత సుందరీకరణ చేసేవాళ్ళం. కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశ, దశ లేదు. ఎలా ఆర్థిక వనరులు సమకూర్చుకుంటారో కూడా తెలియడం లేదు. ఒక బస్తీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాష్టికానికి ఓ వ్యక్తి గుండెపోటుతో చనిపోయారని తెలిసింది. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు ఆవేదన చెందకండి.. మీకు అండగా బీజేపీ ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. మూసీప్రాజెక్ట్ అంతా రాబర్ట్ వాద్రా కోసమే అని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు, ఈ ప్రాజెక్ట్ చేపడుతున్నారని అన్నారు. రాబర్ట్ వాధ్రా ఇటీవల హైదరాబాద్ వచ్చి గుడిని దర్శించారని అంటున్నారని, అసలు విషయం మూసీ ప్రాజెక్ట్ కోసమేనని అన్నారు. మొన్నటి వరకు హైడ్రా జరిగింది.. ఆ బాధితుల్లో జేసీబీ, బుల్డోజర్లు అనే భయం కనిపించాయి. ఇప్పుడు మూసీ బాధితులను చూస్తుంటే వారిలో బీజేపీ ఉందనే భరోసా కనిపిస్తోంది. కాంగ్రెస్ విధానాలపై ప్రజలకు అండగా ఉండి బరా బర్ కొట్లాడుతాం అని బండి సంజయ్ స్పష్టం చేశారు. మూసీ ఒకప్పుడు మంచినీళ్లు అందించిందని.. ఇప్పుడు విషం కక్కుతోందన్నారు. నేను పాదయాత్ర చేసినప్పుడు కళ్లారా చూశా. మూసీ సర్వ నాశనం కావడానికి కారణం కాంగ్రెస్. పరిశ్రమలకు అడ్డగోలుగా పెట్టుకోవాలని చెప్పి అనుమతి ఇచ్చింది వారు కాదా. మొన్న రేవంత్ లండన్ పోయి ఒక నది చూశాడు.. అది చూసే లక్షన్నర కోట్లు అన్నాడు. నిన్న సియోల్‌కు నేతలను పంపాడు.. వాళ్ళు ఎంత చెప్తారో మరి. రేవంత్.. ముందు మంత్రులను మూసీ పరివాహక ప్రాంతాల్లో తిరగమను. అలా వెళ్తే ప్రజలు వాళ్ళను గంప కింద కుమ్ముతారనే భయం రేవంత్‌కు ఉంది. రేవంత్ మొన్న మూసీ సుందరీకరణ అని ఒకసారి అంటాడు.. పునరుజ్జీవనం అని ఒకసారి అంటాడు.. ఏంటో ఆయనకే క్లారిటీ లేదు. లక్షన్నర ఖర్చు అన్నాడు.. మళ్ళీ నేను అనలేదు అంటున్నాడు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదు.. ఇదంతా కాంగ్రెస్ అధినాయకురాలు సోనియా అల్లుడి కోసమే. బీఆర్ఎస్ నేతలకు దీనిపై మాట్లాడే హక్కు లేదు.. వారిది నోరా.. మోరా అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా, మూసీ అంటూ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఒక డ్రామా కంపెనీ అని.. ఆ పార్టీలో ఎవరికీ వారు సీఎంలంటూ సెటైర్ విసిరారు. సబర్మతి ఖర్చు రూ.7 వేల కోట్లు అని, నమామి గంగ ఖర్చు రూ.40 వేల కోట్లు అయితే మూసీకి లక్షన్నర కోట్లా అని ప్రశ్నించారు. ఒక్క కిలోమీటర్‌కు 2 వేల కోట్లా అని నిలదీశారు. ఇంతకంటే కాస్ట్‌లీ ప్రాజెక్టు.. కాస్ట్ లీ స్కామ్ ప్రపంచంలో లేదన్నారు. దోషులు ప్రజలు కాదు.. అక్రమంగా కూల్చుతున్న ప్రభుత్వమే దోషి అని అన్నారు. మాకు కేసులు, లాఠీలు కొత్త కాదు. ఎన్ని జైళ్లు కట్టుకుంటావో కట్టుకో రేవంత్.. మేము కొట్లాడేందుకు సిద్ధం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు రోడ్లపై తిరగకుండా చేస్తాం. మీ అల్లుడికి పైసలు కావాలంటే కాంగ్రెస్ నేతలు దోచుకున్న వాటిలో నుంచి ఇవ్వండి.. పేదల వద్ద నుంచి లాక్కుంటామంటే ఊరుకోం అంటూ బండి సంజయ్ హెచ్చరించారు.

## బాల్య వివాహాలు లేని దేశం భారత్ నిలవాలి

### ఆర్,డి,ఎస్ సోషల్ మొబిలైజర్ హరికృష్ణ


పోస్టర్ విడుదల

కొత్తకోట, అక్టోబర్ 25(నమస్తే ఉదయం) బాల్య వివాహాలు లేని భారతదేశం కావాలని ఆర్ డి ఎస్, సోషల్ మొబిలైజర్ హరికృష్ణ అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బాల బాలికలను రక్షించడంలో భాగంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో కొత్తకోట మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...18 సంవత్సరాలు నిండని అమ్మాయికి 21, సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లిళు చేయకూడదని, పిల్లలని బడికి మాన్పించి పనిలో ఉంచినట్లు అయితే. బాలకార్మిక చట్ట కింద కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. అలాగే బాల్యవివాహాలు చేసిన కూడ చట్టపరమైన చర్యలు ఉంటాయని, పెళ్లిలో పాల్గొన్న మత పెద్దలపై సంబంధికుల మీద కూడా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కొత్తకోట మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు వేయడం జరిగిందని , ఎక్కడైనా అనాథగా బాలబాలికలు ఉన్నట్లు గుర్తించిన బాల్యవివాహాలు చేస్తున్నట్లు ప్రోత్సహించనా వారిపై కఠినంగా చర్యలు ఉంటాయని, చట్టవ్యతిరేకమైన పనులుగా భావించి వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్-1098,లేదా పోలీస్ -100 లేదా సంబంధించిన అధికారులకు తెలియచేయాలని ఆర్ డి ఎస్ సోషల్ మొబిలైజర్ హరికృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీర్ రాంమహేశ్వర్ రెడ్డి , డిడబ్ల్యు ఓ లక్మమ్మ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో చెన్నమ్మ, ఎస్సై. మంజునాథ్ రెడ్డి, లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ ఆసియా, ఎం ఈ ఓ కృష్ణయ్య, ఏపీవో బాలరాజు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో పోలీస్ కుటుంబాల ఆందోళన

మొదటి పేజీ తరువాయి...

అమలు అయ్యే వరకు మెస్ తీసివేసి ఒకే దగ్గర 3 నుంచి 5 సంవత్సరాలు పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిక్రూట్‌మెంట్ విధానంలో ప్రత్యేక బలగాలుగా కొంతమంది ఉద్యోగులను తీసుకుంటారని, బెటాలియన్ల ఉద్యోగాలు చేయడం వల్ల తాము కుటుంబాలకు దూరమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున సెక్రటేరియట్ వద్దకు చేరుకోవడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది.గత కొన్నిరోజులుగా జిల్లాల్లో కొనసాగుతున్న బెటాలియన్ పోలీస్ కుటుంబాల ఆందోళనలు హైదరాబాద్‌కు వ్యాపించాయి. బెటాలియన్ పోలీస్ కుంటుంబాల సభ్యులు సచివాలయ ముట్టడికి యత్నించారు. సెక్రటేరియట్ ముందు బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఒకే దగ్గర విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మొండి వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఏక్ పోలీస్ హామీ ఏమైందని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ కుటుంబ సభ్యుల బాధలను అర్థం చేసుకోవాలన్నారు. కాగా, వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్షలు రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, 9 నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారేగా? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం? అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీసారు.

## నరేంద్రమోదీతో జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్ సమావేశం

మొదటి పేజీ తరువాయి...

పర్యటిస్తారని ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. మెరుగైన భద్రత, రక్షణ సహకారంతో పాటు ఆర్థిక సహకారం.. స్థిరమైన అభివృద్ధి భాగస్వామ్యంపై ఇరువురు నేతలు చర్చించనున్నారని తెలుస్తోంది. అదే విధంగా శుక్రవారం ఢిల్లీలో జరగనున్న 18వ ఆసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ సమ్మిట్‌లో ఇరువురు నేతలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో జర్మనీతో పాటు ఇతర దేశాలకు చెందిన వ్యాపారులు, అధికారులు, రాజకీయ ప్రతినిధులు పాల్గొన నున్నారు. అనంతరం జర్మీ ఛాన్సలర్ గోవాకు వెళ్లనున్నారు. భారత్, జర్మనీలు 2000 నుంచి వ్యూహాత్మక భాగస్వామ్యం కలిగిఉన్నట్లు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

## సిజెఐగా జస్టిస్ ఖన్నా 11న ప్రమాణం

మొదటి పేజీ తరువాయి...

న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఖన్నా, ప్రస్తుత సిజెఐ చంద్రచూడ్ పదవీ విరమణ తర్వాత నవంబర్ 11న ఆ పదవిని చేపట్టనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ ఇప్పటికే జస్టిస్ ఖన్నా పేరును తుదిపరి ప్రధాన న్యాయమూర్తి పదవికి సిఫార్సు చేశారు. ప్రస్తుత న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 65 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసిన ఒక రోజు తర్వాత, నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జస్టిస్ చంద్రచూడ్ నవంబర్ 8, 2022న సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. జస్టిస్ ఖన్నా నియామకానికి ప్రభుత్వ ఆమోదాన్ని ధృవీకరిస్తూ, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని ప్రకటించారు. జస్టిస్ ఖన్నా 183 రోజులు మాత్రమే సీజేఐ ఉండనున్నారు. అంటే ఆయన కేవలం ఆరు నెలలు మాత్రమే ఈ పదవిలో ఉంటారన్నమాట. అతను మే 13, 2025న పదవీ విరమణ చేయనున్నారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి హన్స్ రాజ్ ఖన్నా మేనల్లుడు జస్టిస్ సంజీవ్ ఖన్నా జబల్‌పూర్ కేసులో ఇచ్చిన తీర్పుతో ఆయన ప్రసిద్ధి చెందాడు.

## రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేయాలి

### నడిగడ్డ హక్కుల పోరాట సమితి రంజిత్ కుమార్
### కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దోకా చేస్తోంది

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి గొంగల్ల రంజిత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జోగులాంబ గద్వాల నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ కానీ రైతులు భారీ ఎత్తున కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు .భారీ ఎత్తున రైతులు కలెక్టర్ కార్యాలయం చేరుకొని కలెక్టర్ సంతోష్ బయటకు వచ్చి తమ విన్నపాన్ని వినాలని నిరసన వ్యక్తం చేశారు.తదనంతరం కలెక్టర్ సంతోష్ బయటకొచ్చి వినతి పత్రం స్వీకరించి త్వరలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ కానీ ప్రతి కుటుంబానికి రుణమాఫీయేటట్లు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గొంగల్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి పది నెలలుగావస్తున్న ఇప్పటికి రెండు లక్షల లోపు రుణమాఫీ కాలేదని, అలాగే పెట్టుబడి సాయంగా రైతులకు ఇస్తామన్న రైతు భరోసా కు దిక్కు లేదని విమర్శించారు.ఆధార్ కార్డు,బ్యాంకు పాస్ పుస్తకము,భూమి పాస్ పుస్తకంలో పేర్లలో


ర్యాలీగా కలెక్టరేట్ వస్తున్న రంజిత్ కుమార్..


సమస్యలను కలెక్టర్ సంతోష్ కు వివరిస్తున్న రంజిత్ కుమార్

చిన్న చిన్న తప్పులు ఉన్నాయన్న సాకుతో రుణమాఫీ చేయడం లేదని వెంటనే ఈ సమస్యపై కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి రుణమాఫీ అయ్యేటట్లు చేయాలన్నారు. ఒక వైపేమో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేశామని గొప్పగా చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు రుణమాఫీ కాని వారు ఎందరో ఉన్నారని కలెక్టర్ దగ్గరకు వచ్చిన రైతులను చూస్తే అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు వెంటనే రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయకపోతే జోగులాంబ గద్వాల జిల్లా నుంచి భారీ ఎత్తున రైతులు అసెంబ్లీకి చేరుకొని నిరసన వ్యక్తం చేస్తామన్నారు .కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా అనేక వంకలు చెప్తుందని,కాంగ్రెస్ ప్రభుత్వం ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారం వచ్చిందని, ప్రశ్నించే వారిని అణగదొక్కుతూ విద్యార్థుల పైన లాఠీచార్జి చేస్తూ అమానుష చర్యలకు దిగుతుందే తప్ప ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని ఆయన ఆరోపించారు.ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు లవన్న విష్ణు,తిమ్మప్ప ప్రేమ్ రాజ్ బలరాం నాయుడు, శ్రీనివాస్ యాదవ్,రంగస్వామి విజయ్, రాముడు లక్ష్మన్న సర్వేశ్ పరీక్ష గజేంద్ర అమరేష్ హనుమేష్ తదితరులతోపాటు రుణమాఫీ గాని రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

## గగన్ పహాడ్, రాజేంద్రనగర్, కాటేదాన్, కిస్మత్ పూర్, హిమాయత్ సాగర్, మణికొండ, నార్సింగిలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజేంద్రనగర్, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుసర్ఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని బుద్వేల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12:30 నుండి 1:00 వరకు టీచర్స్ కాలనీ, డేవిడ్ ట్రాన్స్ ఫార్మర్, మెథడిస్ట్ చర్చ్, ఇందిరానగర్, యాదవ్ బస్తి ప్రాంతాలు, ఉప్పర్ పల్లి నాయుడు కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు హైదర్ గూడ ఉప్పర్ పల్లి ,ఎర్రబోడ, వాంబే కాలనీ, నాయుడు కాలనీ ప్రాంతాలు, ఉప్పర్ పల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1గంట నుండి 1:30 గంటల వరకు ఫోర్ట్ విష్యూ కాలనీ, గోల్డెన్ హైట్స్ కాలనీ, సత్సంగ్ విహార్, జన చైతన్య ఫేస్-1,2,3,4 ప్రాంతాలు, జన చైతన్య విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి రెండు గంటల వరకు సన్ రైస్ హెూమ్స్ కాలనీ, సాయి భవాని ప్రాంతాలు, బాసి థ్ బాబా నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒకటిన్నర నుండి మూడు గంటల వరకు ఎంఎం పహడి, జలాల్ బాబా నగర్, భాషిధ్ బాబనగర్, ఖాయం నగర్ ప్రాంతాలు, పరమారెడ్డి హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 11:30 నుండి 1:00 వరకు చింతల్ మెట్, ఉప్పరపల్లి, హరినాథ్ ఎంక్లేవ్, పరపల్లి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వివరించారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**శివరాం పల్లిలో...**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని భవానీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలలో శనివారం ఉదయం 11 నుంచి 11:30 వరకు భవాని కాలనీ ప్రేమావతి పేట పిల్లర్ నెంబర్ 285 ప్రాంతాలు, డ్రీమ్ వ్యాలీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు నైజర్ ఫంక్షన్ హాల్, ఆరంగర్ ప్రాంతాలు లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ తెలిపారు

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని హైదర్ షాకోట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధా థియేటర్స్ ఫేస్-2, పావని హార్మోని విల్లాస్, బచ్చన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ ప్రధాన రహదారి కొంత భాగం, శనివారం ఉదయం 11: నుండి 11:30 గంటల వరకు, సన్ సిటీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు గంధం గూడ, హిమగిరి కాలనీ, హైదర్ షాట్ కోట్, సన్ సిటీ ప్రధాన రహదారి, జైన్స్ సల్స్ బర్గ్, వెస్ట్ ఎండ్ కాలనీ, ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ ఇంజనీర్ బి అమర్ సింగ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.

**కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ లో...**

కిస్మత్పూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యాపీఠం విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 నుండి 11:30 గంటల వరకు సరస్వతీ విద్యాపీఠం, భవాని కాలనీ, సిరి ఎంక్లేవ్, శ్రీనివాస ఎంక్లేవ్, ధాత్రి లేఅవుట్, ఆనంద్ నగర్, కృష్ణానగర్, శివాజీ యూత్ బిల్డింగ్, బండ్లగూడ జాగిర్, పోచ మ్మ గుడి, వికాస్ నగర్ ప్రాంతాలు, స్నేహిత హిల్స్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని డాన్ బెస్కో విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 గంటల వరకు మైఖేల్ కాలనీ, వినాయక్ నగర్, డీడీ కాలనీ, కాళీ మందిర్, ఎన్ఎఫ్సీ కాలనీ, ఆదర్శనగర్, ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, సంధ్యా నగర్, అరుణోదయ నగర్, జి ఆర్ నగర్, మాచన్పల్లి ఎంక్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

**కాటేదాన్ లో...**

కాటేదాన్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గల లక్ష్మి గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం వివిధ మరమ్మత్ లో నిమిత్తం మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. ఈ విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన లక్ష్మి గూడ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఆర్ జి కె, వాంబే కాలనీ, బృందావన్ కాలనీ గణేష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు ఏ విషయాన్ని కి సహకరించాలని ఆయనకురారు.

**మణికొండలో...**

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 1:30 నుండి 2 గంటల వరకు వివిధ మరమ్మత్తుల నిమిత్తం రత్నదీప్, అల్ మార్క్ విటానియా, అశోక్ బిల్డర్స్, అపర్ణ కన్స్ట్రక్షన్స్, నార్సింగి విద్యుత్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన పుప్పాలగూడ లో 12 నుండి 12:30 వరకు, పుప్పాలగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో 11 గంటల నుండి 11:30 వరకు రాఘవేంద్ర కాలనీ, మారుతి నగర్, ఎల్ఐసి కాలనీ, బాలాజీ నగర్, గోల్డెన్ కొరియర్, ఓల్డ్ అల్కాపూర్ విద్యుత్ ఫిల్టర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు వినాయక నగర్ ఫేస్-2, హాల్ మార్క్, ఈ ఐపిఎల్, పెంటయ్య నగర్ కాలనీ, కేఎన్ఆర్ హిల్స్, బి ఆర్ సి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు బిఆర్సి అపార్ట్మెంట్, వినాయక నగర్ ఫేస్ 1 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఇబ్రహీం భాగ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ కే సంతోష్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు

**నార్సింగి లో...**

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలోని బాలాజీ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుండి 1 గంట వరకు మంచిరేవుల, మైత్రి విల్లాస్, గ్రీన్ ల్యాండ్, జైహింద్ కాలనీ, వివేకనంద విద్యుత్ ఫిల్టర్ పరిధిలో ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు నార్సింగి హిట్స్, క్యూబా కాలనీ, కోకాపేట్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గల బాబు ఖాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు 250 స్క్వేర్ యాడ్, బాబు ఖాన్ విల్లా, గోల్డెన్ మెయిల్, గ్రాండ్ ఇన్ఫ్రాటెక్ విల్లాస్, దంతు స్వీట్ హౌస్, వట్టి నాగుల పల్లి విద్యుత్తు విద్యుత్ ఫీడర్ పరిధిలో జిఎంఆర్ ఖానాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుండి 12:30 వరకు ఖానాపూర్, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్, ఇబ్రహీంబాద్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మిలిటరీ విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 11 గంటల వరకు రాందేవ్ గూడ, వన్ మోర్ నగర్ కాలనీ, నేక్నాపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ వి మణికంఠ తెలిపారు తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గగన్ పహాడ్ సెక్షన్ లో... గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల పాయల్ ఫుడ్స్ విద్యుత్ లీడర్ పరిధిలో శనివారం ఉదయం 11:30 నుండి 12 గంటల వరకు ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ పారిశ్రామిక వాడ, మధువన్ కాలనీ వాటర్ ట్యాంక్ ప్రాంతం, జల్ పల్లి విద్యుత్ పీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 11:30 వరకు జల్ పల్లి పారిశ్రామికవాడ, శివాజీ నగర్ పారిశ్రామిక వాడ, శివాజీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని సహకరించగలరని ఆయన కోరారు.





వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ఎదురుగా రోడ్డు ఎగుడు దిగుడు గా ఉన్న ప్రాంతం

ఆర్టీసీ బస్‌లోనుంచి క్రింద పడిపోయిన గురుమూర్తి అనే విద్యార్థి

## రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో ఆర్టీసీ బస్‌లో నుంచి క్రింద పడ్డ బాలుడు

బుద్వేల్, అక్టోబరు 25(ప్రభాత ఉదయం): ఫలక్ నుమా డిపోకు చెందిన ఆర్ టి సి బస్సు లో బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీకి చెందిన గురు మూర్తి అనే విద్యార్థి ప్రయాణిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం ముందు రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండడంతో బస్సులో నుంచి కింద పడిపోయి గాయాల పాలయ్యాడు. శివరాం పల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థి కాలేజీ గేట్ ముందర వాటర్ పైపు లైన్ కోసం తీసిన గోతిని వాటర్ వర్క్ అధికారులు నిర్లక్ష్యంగా రోడ్డుకు ఎత్తుగడ్డగా మట్టిని పూడ్చడంతో ఈ సంఘటన జరిగింది. ఆర్టీసీ బస్సు ఎక్కి శివరాంపల్లి పాఠశాలకు పరీక్ష నిమిత్తం వెళుతున్న విద్యార్థి ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మట్టి గడ్డపై స్పీడ్ గా బస్సును పోనియడంతో బస్సులో నిల్చున్న గురుమూర్తి బస్సు కుదుపుకు అందులో నుండి కింద పడి కింద పడిపోవడం జరిగింది. గురుమూర్తి కి నెత్తిలో గాయం, నోట్లో ఉన్న పండ్లు సైతం విరిగిపోవడం జరిగింది. ఇదే క్రమంలో కాలేజీ గేటు ముందు కాపలా కాస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ అబ్బాయిని చేర దీసి స్థానిక ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ రోడ్డును బాగు చేయాలని కోరారు.



లక్ష్మీ రామ్ హోరన్ అపార్ట్మెంట్ ఫ్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

## లక్ష్మీరాం హోరన్ అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయి రెడ్డి

బుద్వేల్, అక్టోబరు 25(ప్రభాత ఉదయం): అత్తాపూర్ డివిజన్ లోని హైదర్ గూడ లక్ష్మీరామ్ హరన్ అపార్ట్మెంట్ ఫ్లాట్ యజమానుల సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటయింది. మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ నిబంధనల ప్రకారం ఏర్పాటైన ఈ కార్యవర్గానికి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సుధాకర్ ఆమోదముద్ర వేశారు. ఎల్ ఆర్ హెచ్ ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా శీలం సాయి సత్యనారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా నెట్టెం కన్నబాబు, సెక్రటరీగా శివకుమార్ తిరుమల్లి, జాయింట్ సెక్రటరీగా వారణాసి సుబ్రహ్మణ్య కశ్యప్, కోశాధికారిగా గోబిందు పంకజగర్వాల్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా హరికిషన్ అగర్వాల్, పుంజాల దేవరాజు, తోట శ్రీనివాస్, మేడం వరలక్ష్మి ఎన్నికయ్యారు. ఎలక్షన్ ఆఫీసర్ గా జిల్లా కోర్టు సీనియర్ అధికారి వెంకట రంగారెడ్డి వ్యవహరించారు. ఏకగ్రీవంగా ఎన్నిక కావడానికి సహకరించిన అపార్ట్మెంట్ వాసులందరికీ ప్రెసిడెంట్ సాయి రెడ్డి, డైరెక్టర్ హరికిషన్ అగర్వాల్ కృతజ్ఞతలు తెలిపారు.




గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమావేశం లో మాట్లాడుతున్న పుస్తకాల నర్సింగ్ రావు

## గిరిజన సమస్యలు పరిష్కరించండి

### సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్ రావు డిమాండ్

బుద్వేల్, అక్టోబరు 25(ప్రభాత ఉదయం): తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమావేశం రాజేంద్రనగర్ లోని సీపీఐ కార్యాలయం (ఏ ఆర్ దేవరాజ్ భవన్ ) లో గిరిజన సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి భిక్షు నాయక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు... ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మెంబర్ పుస్తకాల నర్సింగ్ రావు హాజరయ్యారు... ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల తండా గ్రామపంచాయతీలను రెవిన్యూ గ్రామపంచాయతీలుగా గుర్తించాలన్నారు. రాష్ట్రంలో ఎస్టీ కమిషన్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన సంస్కృతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు . రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఎస్టి కార్పొరేషన్ సబ్సిడీ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల 10 శాతం రిజర్వేషన్ సంపూర్ణంగా అమలు చేయాలని , అటవీ హక్కుల చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి భూమిలేని గిరిజనులకు భూమి ఇవ్వాలని గుర్తు చేశారు. గిరిజనుల వాటా బడ్జెట్ నిధులను దారి మళ్ళించకుండా గిరిజనులకే ఖర్చు చేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజనులకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలను ఇండ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు... తండాల్లో గ్రామాల్లో ఉన్న స్థానిక సమస్యలైనటువంటి మంచినీటి కొరతను, విద్యుత్ కొరతను, రోడ్ల సౌకర్యం, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గిరిజన భాషలను గుర్తించి వాటిని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం 8వ షెడ్యూల్లో చేర్చి వారికి లిపి ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని గిరిజన సమస్యలు పరిష్కారమయ్యే వరకు తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి జర్పుల శివ నాయక్, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రియాజ్, గిరిజన సమాఖ్య జిల్లా కోశాధికారి రమావత్ చత్రు నాయక్, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు లోక్యా నాయక్, శంకర్ నాయక్, సరిలాల్ నాయక్,ఆఫీస్ కార్యదర్శి సత్యం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్య సీటు సాధించిన విద్యార్థిని కి ఆర్థిక సహాయం చెకు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

## పేదింటి ఆడబిడ్డ ఎంబీబీఎస్ చదువుకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

### ఎంబీబీఎస్ విద్యార్థిని ప్రవర్షకు తన ఎం జె ఆర్ ట్రస్ట్ ద్వారా మొదటి సంవత్సరం ఫీజు 75 వేలు ఆర్థిక సహాయం అందజేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మిగతా మూడు సంవత్సరాల ఫీజు తన ట్రస్ట్ ద్వారా చెల్లిస్తా అని బరోసా ఇచ్చారు

నాగర్ కర్నూల్, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం జెట్ ప్రోలు గ్రామానికి చెందిన సులిగురి ఉషమ్మ, వెంకటయ్య దంపతుల కుమార్తె ప్రహర్ష కు నారాయణపేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. అయితే ప్రవర్ష ఎంబిబిఎస్ సీట్ సాధించినప్పటికీ ఆర్థిక స్తోమత లేకపోతే చదివించలేకపోతున్నామని అయోమయంలో కుటుంబం ఆలోచిస్తుంది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి చూసి వెంటనే ఆయన వారి వివరాలు తెలుసుకొని తన ఎం జె ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అ అమ్మాయి ఎంబీబీఎస్ చదవడానికి అంగీకరించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వెంటనే వర్షిత మొదటి ఏడాది ఫీజు కోసం 75 వేలు రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎంబీబీఎస్ చదువు పూర్తి అయ్యే వరకు ఇంకా మూడు సంవత్సరాల ఫీజు తన ట్రస్ట్ ద్వారానే చెల్లిస్తా అని అమ్మాయికి బరోసా ఇచ్చారు.సోషల్ మీడియా ద్వారా తమ విన్నపాన్ని తెలుసుకొని తమ కుమార్తె ఎంబీబీఎస్ చదువుకు ఆర్థిక సహాయం అందజేసి ఎంబీబీఎస్ పూర్తి అయ్యే వరకు అండగా ఉంటానన్న మర్రి జనార్దన్ రెడ్డి కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అమ్మాయి తల్లిదండ్రులు తెలిపారు.



## ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్

రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోను శుక్రవారం డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్ సందర్శించారు . ఈ సందర్శనలో భాగంగా డిపోలోని అన్ని విభాగాలను ఆయన తనిఖీ చేశారు. ఆ తర్వాత జరిగిన కార్యక్రమంలో బెస్ట్ మెకానిక్ గా ఎన్నికైన శివకుమార్ , బెస్ట్ శ్రామక్ గా ఎన్నికైన ఏస్ కె రెడ్డి లకు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జగన్ మాట్లాడుతూ, మనం ప్రయాణికులకు నాణ్యమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలంటే బస్సుల నిర్వహణ మెకానిక్ సోదరులకు పైనే ఆధారపడి ఉంటుందని.కావున ప్రతి ఒక్కరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వహించి పరిశుభ్రమైన మరియు మంచి కండిషన్ గల బస్సులను అందించి సంస్థ పై ప్రయాణికులకున్న గౌరవాన్ని పెంచాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగన్ తో పాటు రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రి నారాయణ మెకానికల్ ఇంజనీర్ నీలిమ, మరియు ఏస్ టీ ఐ సుశీల డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డులో వెలగని వీధీ దీపాలు

బుద్వేల్, అక్టోబరు 25(ప్రభాత ఉదయం) : కాటేదాన్ నుంచి గగన్ పహాడ్ కి వెళ్లే పాత కర్నూల్ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళలలో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ విభాగం అదికారు లు రాత్రి వేళలో ఒకసారి ఈ మార్గంలో ప్రయాణించి చూడాలని కోరుతున్నారు. ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలో అంధకారం పెరగడంతో, అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు తెలిపారు.ఈ విషయాన్ని గుర్తించిన రాజేంద్రనగర్ సర్కిల్ నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి మరియు నరేష్ యాదవ్, సంబంధిత అధికారులకు తెలిపి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అధికారులు దయచేసి ఈ ప్రమాదకర పరిస్థితిని సీరియస్‌గా తీసుకుని, త్వరితగతిలో చర్యలు తీసుకోవాలని వారు అభ్యర్థించారు.



పాత కర్నూల్ రోడ్డులో వెలగని వీధీ దీపాలు

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉధృత పోరాటాలు

### సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని, అందుకు సిపిఎం కార్యకర్తలు తమ చివరి శ్వాస వరకు దోపిడీ పీడన నుంచి పీడిత ప్రజలను విముక్తి చేసేంత వరకు పోరాడాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ సిపిఎం కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అనంత కన్వెన్షన్ హాల్లో సిపిఎం మూడవ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి.మహా సభల సందర్భంగా పార్టీ జెండాను పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ ఎగురవేశారు.అనంతరం అమరుల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజా సమస్యల పరిష్కరించకుండా ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తున్నారని, కులమత ప్రాంతాలతో సంబంధం లేకుండా అణగారిన వర్గాలను దోపిడీ పీడన నుంచి విముక్తి చేయడానికి ప్రతి సిపిఎం కార్యకర్త తన చివరి శ్వాస వరకు పోరాడాలని అన్నారు పాలకులు ఎవరు అధికారంలోకి వచ్చిన తమ పెట్టుబడి దారి పంథాను మార్చుకోరని, వ్యవస్థలో అసమానతలు ఉండాలని కోరుకోవడం పెట్టుబడిదారీ విధానం సహజ లక్షణం అని, సిపిఎం కార్యకర్తలు మతోన్మాదాన్ని ఆర్థిక సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా రెండింటిని మేళవించి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు నిర్బంధాలు ఆటంకాలు ఎన్ని ఎదురైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త అకుంఠిత దీక్షతో పనిచేయాలని అన్నారు గత దశాబ్ద కాలంలో బిజెపి పాలనలో చట్టబద్ధ రాజ్యాంగ బద్ధ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్ని వ్యవస్థల్లోకి రాజకీయ జోక్యం పెరిగి విజ్ఞాన శాస్త్రం వెనకకు వెళు తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రపంచానికి ఉత్పత్తిదారు ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశాన్ని దిగుమతులపై ఆధారపడి వినియోగదారి ఆర్థిక వ్యవస్థగా మార్చారని విమర్శించారు ఐక్యరాజ్యసమితి సహ అనేక



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

అంతర్జాతీయ సంస్థలు దేశతిరోగమనాన్ని ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్న బిజెపి పాలకులు నిరంకుశంతో ముందుకు వెళ్తున్నారని విమర్శించారు దేశ సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ పాలన కేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు బిజెపి విధానాలపై ప్రాంతీయ పార్టీలు మేలుకొనకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు, ఈ మహాసభలకు ప్రముఖ వైద్యులు డాక్టర్ మోహన్ రావు సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులు రామన్ గౌడ్ తదితరులు హాజరై తమ సందేశాన్ని వినిపించారు, వర్తమాన ప్రపంచానికి కమ్యూనిస్టు పార్టీల అవసరం ఉందని అధికారంలో ఉన్న లేకున్నా పీడిత ప్రజల వైపు పోరాడేది ఎర్రజెండా లేనని అన్నారు, కమ్యూనిస్టులు బలహీన పడటం అంటే పీడిత ప్రజల తమ ప్రశ్నించే హక్కును కోల్పోవడమేనని అంతరాల లేని సమాజం కోసం నిరంతరం పరితపిస్తున్న కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు ఈ మహాసభలలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, న్యాయవాదులు ప్రాగటూరు లక్ష్మణ్ మధుసూదన్ జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు జి.రాజు వివి నరసింహ పరం జ్యోతి మద్దిలేటి ఉప్పేర్ నరసింహ ఈదన్న నర్మద రమేష్ మండలాల కార్యదర్శులు ఆంజనేయులు దేవదాసు ,గంగన్న, ఈశ్వర్ విజయ్ కుమార్,వివిధ మండలాల నుంచి సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ సంతోషం కలిసిన జిల్లా గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గం

## జిల్లా అభివృద్ధిలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి: కలెక్టర్ సంతోష్

### జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) జిల్లాలో నూతనంగా ఎన్నిక కాబడిన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (TGO) కమిటీ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోష్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కమిటీ సభ్యులు ఉద్యోగుల అంశాలతో పాటు జిల్లా అభివృద్ధి పనులలో భాగస్వామ్యం అందించాలని సూచించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో టి జి ఓ ప్రెసిడెంట్ ఎం.డి. రహీముద్దీన్, కార్యదర్శి శశిధర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కె. వెంకట రాజారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రామచంద్రప్ప, భీమ్లా, సతీష్ కుమార్ రాజేశ్వరి జాయింట్ సెక్రెటరీ రామాంజనేయులు గౌడ్, మహమ్మద్ కలీం, ట్రెజరర్ వెంకటరెడ్డి, సెక్రటరీ డా. యామిని సాయి, ఆఫీస్ సెక్రటరీ రాయుడు, కల్చరల్ సెక్రటరీ పవన్ కుమార్ తదితరులు ఉన్నారు.



గ్యార్మిలో పాల్గొన్న కాంగ్రెస్ కూకట్ పల్లి ఇంచార్జ్ బండి రమేష్

## గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి,అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమీర్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి అల్లాపూర్ డివిజన్ సఫదర్ నగర్ లో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలకు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మూడువేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, మొయిజుద్దీన్, విటల్ రెడ్డి, కనకయ్య, సయ్యద్ ఐజాజ్, మస్తాన్ రెడ్డి, నజీర్, ఇర్ఫాన్, శివ చౌదరి, సంతోష్ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూసాపేట్ వసుంధర ఆస్పత్రి వద్దగల నాలను విస్తరింప చేయాలి: జిట్టా సునీల్ కుమార్



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిట్టా సునీల్ కుమార్

కూకట్‌పల్లి,అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో గల మూసాపేట్ సర్కిల్ ప్రగతి నగర్ వసుంధర ఆసుపత్రి వెళ్లే దారిలో నాలా విస్తరింప చేయకపోవడం వలన ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని శుక్రవారం జిహెచ్ఎంసి మూసాపేట్ సర్కిల్ కమిషనర్ రమేష్ ని కూకట్ పల్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్చార్జి జిట్టా సునీల్ కుమార్ యాదవ్ మర్యాదగా పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం జిట్టా సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రతి నిత్యం ఉదయం సాయంకాల వేళలో పాదాచార్యులు ద్విచక్ర వాహనదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నాలను విస్తరింపజేసి ట్రాఫిక్ సమస్య నుండి ప్రజలను కాపాడాలని తెలిపారు. మూసాపేట్ సర్కిల్ కమిషనర్ రమేష్ సానుకూలంగా స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగదున నాలా పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

## ప్రైవేట్ భూమిని ప్రభుత్వ భూమిగా తప్పుడు ప్రచారం చేయడం తగదు: వలియోద్దీన్

### అది మా పూర్వీకుల నుండి సంక్రమించిన పట్టాభూమి



కోర్టు ఆర్డర్ ను చూపిస్తున్న వలియోద్దీన్

శంషాబాద్, అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం) శంషాబాద్ రెవిన్యూ పరిధిలోనిసర్వే నంబర్ 626/1 లో గల ప్రైవేట్ భూమిని ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేయడం సరి కాదని ఎన్. ఎం. వలియోద్దీన్ ఖాన్ అతని న్యాయవాది మీర్ అహ్మద్ ఖాన్ తో కలిసి స్పష్టం చేశారు. శంషాబాద్ పట్టణంలోని సర్వే నంబర్ 626/1 లొ తమకు 12 ఎకరాల నాలుగు గుంటల భూమి ఉన్నదని వలియోద్దీన్ స్పష్టం చేశారు . ఈ భూమి తాత ముత్తాతల నుండి తమకు వారసత్వంగా సంక్రమించిందని ఆయన తెలిపారు. సర్వే నంబర్ 626/1లో ఉన్న దాదాపు 340 ఎకరాల భూమిని గతంలో కూడా స్వాధీనం చేసుకున్నదని తెలిపారు. కాగా తమకు చెందిన 12 ఎకరాల నాలుగు గంటల భూమిని మాత్రం హుడా అధికారులు స్వాధీనం చేసుకోలేదని తెలిపారు. దీనికి సంబంధించి హుడా అధికారులు జారీ చేసిన పంచనామా పత్రాలను చూపించారు. ఈ భూమికి సంబంధించి రెవెన్యూ. హెచ్ఎండిఏ . అధికారులతో తమకు కోర్టులో కేసు నడుస్తున్నదని తెలిపారు . కాగా స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు తమ భూమిలో నుండి 3000 చదరపు గజాల భూమి ఇవ్వాలని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ఎందుకు తాము అంగీకరించకపోవడంతో ఈ స్థలం ప్రభుత్వాన్నిదని దుష్ప్రచారం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమను బెదిరిస్తూ ఇది ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఆధ్యాయ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వలియోద్దీన్ ఖాన్. మీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కరుణాకర్ రెడ్డి. పెద్ద రాము. శేఖర్ గుప్తా. కుమార్ యాదవ్. శ్రీనివాస్ రెడ్డి తదితరులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ను సన్మానిస్తున్న ఐక్యవేదిక

## లక్ష్మీనారాయణ బదిలీపై గద్వాల జాయింట్ కలెక్టర్‌గా (రెవెన్యూ)ను కలిసిన వనపర్తి అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్

### గంజిపేట రాజు.. బి ఆర్ ఎస్ పార్టీ గద్వాల జిల్లా నాయకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) గద్వాలలో జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) గా పదవి బాధ్యతలు చేపట్టిన వనపర్తి నియోజకవర్గ వాసి లక్ష్మీనారాయణ ని మర్యాదపూర్వకంగా వనపర్తి , గద్వాల జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు . కొత్తకోట వాస్తవ్యులు శివ యాదవ్ ఇరిగేషన్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం సాధించి గద్వాల లో జాయిన్ అయినందున అతనికి జెయింట్ కలెక్టర్ ద్వారా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్ మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అఖిలపక్ష ఐక్యవేదిక ఏర్పాటు చేసి విద్యార్థులను ఉన్నత పదలలో ఆసీనులైన అధికారులకు సత్కరించడం ఆనవాయితీ అని, అది కూడా వనపర్తి నియోజకవర్గ వాస్తవ్యులైన లక్ష్మీనారాయణ జాయింట్ కలెక్టర్ గా గద్వాలలో జాయిన్ కావడం సంతోషకరమని అలాగే కొత్తకోట వాస్తవ్యులు శివ యాదవ్ కూడ అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగం సాధించి గద్వాలలో జాయిన్ అయిన సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గద్వాల ఆర్డిఓ , ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సతీష్ యాదవ్, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు గంజిపేట రాజు, వనపర్తి కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్తగూళ్ల శంకర్, బీసీ నాయకులు గౌనికాని యాదయ్య, గద్వాల నాయకులు వెంకటేష్,అకేపోగు రాజు,ప్రవీణ్ కుమార్,రేకులపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేపడుతున్న కౌన్సిలర్, బిజెపి నాయకుడు కొమ్ము భరత్

## ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని ప్రజలు సంపూర్ణంగా స్వాగతిస్తున్నారు

### బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్ భూషణ్

### బిజెపిలో చేరటానికి ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు

### కొత్తకోట పట్టణంలో ముమ్మరంగా బిజెపి పార్టీ సభ్యతలు

కొత్తకోట, అక్టోబర్ 25(ప్రభాత ఉదయం) గత పదేళ్లలో కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బిజెపిలో చేరటానికి ప్రజల స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని కొత్తకోట మున్సిపాలిటీ సీనియర్ నాయకులు,బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్ భూషణ్ చెప్పారు. శుక్రవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ని వీవర్స్ కాలనీలో శుక్రవారం బిజెపి పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం ముమ్మరంగా పెద్ద ఎత్తున కొనసాగుతుందని బిజెపి పార్టీ ఫ్లోర్ లీడర్ కొమ్ము భరత్ భూషణ్ చెప్పారు. ఈ సందర్భంగా భరత్ భూషణ్ మాట్లాడుతూ... తెలంగాణలో మహిళలు యువకులు బిజెపి పార్టీ వైపు మేగ్గు చూపుతున్నారని కొత్తకోట మండలంలో ఇప్పటివరకు 5,000 మంది పార్టీ డిజిటల్ సభ్యత నమోదు చేసుకున్నారని అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ సారథ్యంలో యువకులు మహిళలు ఆకర్షితులై పార్టీ లో చేరుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రం లో బిజెపి పార్టీ జెండాను ఎగరవేస్తామని కొమ్ము భరత్ భూషణ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వాల కన్వీనర్ వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, కో కన్వీనర్లు స్టార్ బాలు, ఆవుల రాఘవేందర్ గౌడ్, అమరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

## అభివృద్ధి పనులను అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కూకట్‌పల్లి,అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకానంద నగర్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అర్ధరాత్రి పర్యవేక్షించారు. వివేకానంద నగర్ కాలనీలో మెయిన్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న డివైడర్, ఆర్ సీసీ గ్రిల్స్ తో నిర్మిస్తున్న డివైడర్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అర్ధరాత్రి జరుగుతున్న ఆర్ సిసి రోడ్డు పనులను అకస్మాత్తుగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అర్ధరాత్రి జరుగుతున్న గ్రిల్స్ నిర్మాణ పనులలో జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. సుమారు రెండు గంటలు రోడ్డుపైనే పనులను పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి ప్రజా అవసరాల కొరకు పనిచేసే ఎమ్మెల్యేకి రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురందరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి. ప్రసాద్, మాధవ్ నిఖిల్, వర్క్ ఇన్స్పెక్టర్ గురువారెడ్డి, కాంట్రాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



స్మశాన వాటికలో వసతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## దయార్ గూడ బస్తీలో స్మశానవాటిక స్థలాన్ని కబ్జా దారులు నుండి రక్షించాలి

### ఎమ్మెల్యే కృష్ణారావుకు బస్తీ వాసులు మొర

కూకట్‌పల్లి,అక్టోబర్ 25 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గంలోని ప్రశాంత్ నగర్ పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న స్మశానవాటిక స్థలాన్ని ఇటీవల కొందరు వ్యక్తులు తప్పుడు సర్వే నంబర్లతో కబ్జా చేస్తున్నట్లు దయర్ గూడ స్థానిక బస్తీ వాసులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో శుక్రవారం స్థానికులు బస్తీవాసులతో కలిసి స్మశానవాటికను ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 200 లులో సుమారు ఐదు ఎకరాలకు పైగా భూమిని స్మశాన వాటిక కోసం వదలటం జరిగిందని తెలిపారు. ఇందుకు అధారంగా రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు శ్మశాన వాటిక అధీనంలో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటని, కబ్జాదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ విషయమై తగిన విచారణ చేసి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంత్ నగర్ ప్రాంతంలో నాలాలు స్మశాన వాటికలను కబ్జా చేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.